

అట్టహాసంగా లోకేష్ జన్మదిన వేడుకలు - 6వ పేజీ
కాకినాడలో కాంగ్రెస్ రాస్తారోకో - 6వ పేజీ
ఉత్కంఠగా లాన్ టెన్నిస్ పోటీలు - 5వ పేజీ
నేటి నుంచి నాటిక పోటీలు - 5వ పేజీ

నేతల రాక.. ఎన్నికల కాక

- నేతల వరుస పర్యటనలతో పెరుగుతున్న ఎన్నికల వేడి
- నేటినుంచి మూడురోజులపాటు ఉమ్మడి తూ.గో.జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటన
- చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై ఆవేదనతో మృతిచెందిన కుటుంబాలకు పరామర్శ
- రేపు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కాకినాడ పర్యటన
- నేటి రాత్రికి విశాఖ నుంచి రాక
- ఉమ్మడి తూ.గో. జిల్లా కాంగ్రెస్ నేతలు, క్యాడర్‌తో సమీక్ష
- రేపటినుంచి జనసేన అధినేత కోనసీమ పర్యటన
- నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, నేతలతో ఎన్నికల సమాయత్తంపై సమీక్ష
- ఇప్పటికే లోకేశ్ యువగళం, పవన్ సమీక్షలు, చంద్రబాబు రా.. కదలిరా సభలతో టీడీపీ, జనసేనలో జోష్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్రమేపీ అసెంబ్లీ ఎన్నికల వేడి ఊపందుకుంటోంది. ఎన్నికలకు ఇంకా కొన్నిరోజులే ఉండడంతో రాజకీయ పార్టీలు నేతలు, క్యాడర్‌లో జోష్ నింపే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ఆయా పార్టీల అధ్యక్షులు, కీలక నేతలు తరచూ ఉమ్మడి జిల్లా పర్యటనలకు వస్తుండడంతో ఎన్నికల సందడిని పెంచుతోంది. ఇప్పటికే గతనెలలో లోకేశ్ యువగళం పాదయాత్ర, కాకినాడలో మూడురోజులపాటు పవన్ ఎన్నికల సమీక్ష, అటు ఈనెల 10, 20 తేదీల్లో తుని, మండపేటలో టీడీపీ అధినేత చంద్రబాబు రా.. కదలి రా.. సభలతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల వేడి రాజేసింది. టీడీపీ, జనసేన పార్టీల్లో ఎనలేని జోష్ నింపింది. అటు సీఎం జగన్ కాకినాడలో జనవరి 3న పర్యటించి వైసీపీ క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేశారు. తిరిగి మళ్లీ ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు, కీలక నేతలు పర్యటిస్తుండడంతో రాజకీయ సందడి నెలకొంది.






ఆ కుటుంబాలకు అండగా..

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నేటి నుంచి మూడురోజులపాటు ఉమ్మడి తూర్పుగోదావరిలో పర్యటించనున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై మరణించిన అభిమానులకు సంబంధించి వారి కుటుంబాలను పరామర్శించనున్నారు. 'నిజం గెలవాలి' పేరుతో బుధవారం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడురోజులపాటు పర్యటించనున్నారు. చంద్రబాబును స్కిల్ కేసులో అక్రమంగా అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధించిన సమయంలో మనోవేదనకు గురై చనిపోయిన వ్యక్తులకు సంబంధించి వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించనున్నారు. దీనికిగాను బుధవారం మధ్యాహ్నం 11.30 గంటలకు భువనేశ్వరి మధురపూడి విమానాశ్రయానికి చేరుకోనున్నారు. 24, 25, 26 తేదీల్లో కాకినాడ జిల్లా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించనున్నారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు మధురపూడి విమానాశ్రయంనుంచి ఆమె హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు. ఇప్పుడు భువనేశ్వరి పర్యటనతో చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి అధికార వైసీపీ ఎంత దుర్మార్గంగా వ్యవహరించిందనే విషయం ప్రజల్లోకి మరోసారి మరింత బలంగా వెళ్లనుంది.

నిస్తేజం నుంచి ఉత్సాహం కల్పించే దిశగా..

ఒకప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఓ వెలుగువెలిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన అనంతరం పూర్తిగా పాతాళానికి పడిపోయింది. రాష్ట్ర విభజన ప్రభావంతో కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి జిల్లాలో దాదాపు కీలక నేతల దగ్గరనుంచి ఎన్నో ఏళ్లనుంచి కొనసాగుతున్న నేతలు, కార్యకర్తలు కూడా దూరమైపోయారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పార్టీ ఏదో ఉంది అన్నట్లు తయారైంది. ఈ నేపథ్యంలో కొత్తగా పీసీసీ పగ్గాలు చేపట్టిన షర్మిల ఈనెల 25న జిల్లాలో పర్యటించనున్నారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడ్డ నేపథ్యంలో తిరిగి కాంగ్రెస్‌కు ఉమ్మడి జిల్లాలో జీవం పోసేందుకు కసరత్తు చేపట్టనున్నారు. 24న రాత్రికి కాకినాడలో బస చేసి 25న ఉదయం కాకినాడ సూర్యకళామందిరంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి పార్టీ కీలక నేతలు, కార్యకర్తలు, అభిమానులతో ప్రత్యేకంగా సమీక్ష ఏర్పాటు చేస్తున్నారు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన పార్టీని తిరిగి కాపాడుకుని ఎన్నికల సమయం నాటికి ఎంతో కొంత పుంజుకునే దిశగా దిశానిర్దేశం చేయనున్నారు. 25న మధ్యాహ్నం వరకు ఇక్కడే ఉండి తిరిగి ఏలూరు వెళ్తారు.

అన్నీ గెలవాల్సిందే..

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ 25న కోనసీమ జిల్లా పర్యటనకు రానున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గాలవారీగా పార్టీ బలాబలాలపై సమీక్ష చేయనున్నారు. ఈ మేరకు ఇటీవల రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన పార్టీ కీలక నేత నాదెండ్ల మనోహర్ ఈ విషయాన్ని అధికారికంగా పర్యటించారు. వాస్తవానికి గతనెల 27నుంచి మూడురోజులపాటు పవన్ కాకినాడ కేంద్రంగా మకాం వేశారు. కాకినాడ జిల్లా పరిధిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో సమీక్ష నిర్వహించారు. ఎక్కడెక్కడ పార్టీ బలంగా ఉందో సమీక్షించారు. కాకినాడ సిటీ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారించి డివిజన్లవారీగా సమీక్షలు కూడా జరిపారు. తదుపరి ఇప్పుడు కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం కేంద్రంగా సమీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం కేంద్రంగా సమీక్షలు ప్రారంభిస్తారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు కూడా అధికార వైసీపీ గెలవదని, గెలవకుండా తాను చూసుకుంటానని పవన్ ఇప్పటికే హెచ్చరించారు. అందులోభాగంగా టీడీపీ, జనసేన కూటమి దాదాపు అన్ని స్థానాల్లో గెలిచేలా ప్రత్యేక ఎన్నికల ప్రణాళికతో పవన్ పావులు కదుపుతున్నారు. అందులోభాగంగా ఉమ్మడి జిల్లాలో సమీక్షలకు అధిక సమయం వెచ్చిస్తున్నారు. పవన్ పర్యటనకు సంబంధించి అధికారిక షెడ్యూల్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది. వరుసగా పార్టీల అధ్యక్షులు, కీలక నేతల పర్యటనలతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల సందడి అంతకంతకూ పెరుగుతోంది. అటు రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఎక్కువ సీట్లు దక్కించుకోవడానికి ఈ పర్యటనలు ఎంతగానో దోహదపడతాయని ఆయా పార్టీలు వేటికవే బలంగా నమ్ముతున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాపై నేతల ప్రత్యేక దృష్టికి ప్రధాన కారణం అవుతోంది. జిల్లాలో గతనెల్లో లోకేశ్ యువగళం పాదయాత్రతో టీడీపీ శ్రేణుల్లో ఎనలేని ఉత్సాహాన్ని నింపింది. పాదయాత్రకు ప్రజలనుంచి అనూహ్య స్పందన రావడంతో పార్టీకి పెద్ద బలాన్నించింది. ఆ తర్వాత పవన్ వరుస సమీక్షలు, ఈనెల 10, 20వ తేదీల్లో చంద్రబాబు తుని, మండపేట సభలకు జనం పోటెత్తడం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టీడీపీ, జనసేన కూటమికి ఎనలేని బలాన్ని ఇచ్చింది.

నేటినుంచి భువనేశ్వరి 'నిజం గెలవాలి'

- ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో మూడురోజులపాటు పర్యటన
- చంద్రబాబు అరెస్టు సమయంలో మరణించిన వారి కుటుంబాలకు పరామర్శ

- 5వ పేజీ

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- క్షేత్రస్థాయిలో జిల్లా అధికారుల కసరత్తులు
- ఎన్నికల విధులకు ఉపాధ్యాయులు
- ఆదేశాలిచ్చిన కేంద్ర ఎన్నికల కమిషన్
- జిల్లా విద్యాశాఖనుంచి సమాచారం సేకరణ

కాకినాడ రూరల్, జనవరి 23: ఎన్నికలను నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగమంతా సిద్ధమవుతోంది. ఇప్పటివరకూ ఓటర్లనుంచి వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిశీలన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వాటివద్ద వసతులపై సమీక్షలు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అవసరమైన సిబ్బంది నియామకంకోసం కసరత్తు ఇప్పటికే మొదలైంది. ఈసారి ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను దూరం పెట్టాలని సీఎం జగన్ ఎన్నో ప్రయత్నాలు చేసినా కేంద్ర ఎన్నికల కమిషన్ దానికి విరుద్ధమైన ఆదేశాలిచ్చింది. ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించాలని ఆదేశాలు జారీ చేయడంతో వారి వివరాలను సేకరించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల వివరాలను జిల్లాలోని విద్యాశాఖనుంచి జాతీయ సమాచార కేంద్రం(ఎన్ఐసీ) సేకరించింది.

ఉపాధ్యాయులను దూరంగా ఉంచాలని..

బకాయిలచెల్లింపు, పీఆర్సీ అమలులో రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడేలా ఉపాధ్యాయులంతా పెద్దఎత్తున ఆందోళన చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే ఉపాధ్యాయులను ఆ విధులకు దూరంగా ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యాహక్కు చట్టానికి సవరణల పేరిట ఉపాధ్యాయులకు బోధన, విద్యాసంబంధిత అంశాలు తప్ప బోధనేతర విధులు ఏవీ అప్పగించరాదని గతేడాది నవంబరు 29న ఉత్తర్వులు జారీచేసింది. ఉపాధ్యాయుల ప్రమేయంతో ఎన్నికలు నిర్వహించడం ఇష్టం లేని వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు సచివాలయాల ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఎన్నికలవిధుల్లో అనుభవంఉన్న ఉపాధ్యాయులను పక్కన పెట్టడం సరికాదని ఎన్నికల కమిషన్ భావించింది. కీలకమైన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులనే నియమించాలని పేర్కొనడంతో ఆ విషయం అధికార పార్టీకి మింగుడు పడడం లేదని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

ఉపాధ్యాయులకు విధులు

సార్వత్రిక ఎన్నికలకు ఈసారి కాకినాడ జిల్లాలో 1637 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. 9500మంది ఎన్నికల సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. విద్యాశాఖనుంచి 6000మంది ఉపాధ్యాయులు, డీవైఈవోలు, ఎంఈవోలతో కలిపి 450మంది బోధనేతర సిబ్బంది ఉన్నట్లు వివరాలను అధికారులు సేకరించారు. వారందరికీ కేడర్‌ను బట్టి ఎన్నికల విధులను అప్పగించనున్నట్లు సమాచారం. ప్రధానాధికారి కేడర్ ఉన్న వారిని రూట్ ఆఫీసర్లుగాను, పర్యవేక్షణాధికారులుగాను నియమిస్తారు. అత్యంత కీలకమైన పీవోలుగా ఉపాధ్యాయులనే నియమించనున్నారు. గతంలో ఏపీవోలుగా అంగన్‌వాడీ కార్యకర్తలుండేవారు. ఈసారి వారి స్థానంలో సచివాలయ ఉద్యోగులను నియమించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్ష పార్టీలు సచివాలయ సిబ్బందిని ఎన్నికల విధులకు నియమించరాదని న్యాయస్థానంలో కేసు వేశాయి. న్యాయస్థానంనుంచి వచ్చే తీర్పును బట్టి ఏపీవోల నియామకం ఉండవచ్చు.

చర్చలు ఫలించడంతో విధుల్లోకి అంగన్‌వాడీలు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 23: తమకు ఇచ్చిన హామీల అమలుకు 42రోజులుగా సమ్మె చేసిన అంగన్‌వాడీలు సోమవారం రాత్రి ప్రభుత్వంతో జరిగిన చర్చలు ఫలించడంతో తిరిగి విధుల్లో చేరారు. జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లు 1,971మంది, హెల్పర్లు 1,913మంది మంగళవారం ఆయా సెంటర్లలో సూపర్‌వైజర్లకు జాయినింగ్ లెటర్లు ఇచ్చి విధులకు హాజరయ్యారు. ఇప్పటి వరకు ఆయా సెంటర్ల బాధ్యతలు తీసుకున్న వలంటీర్లు సచివాలయ సిబ్బంది నుంచి స్టాక్‌కు సంబంధించి చార్జ్ లిస్టులు తీసుకుని అంగన్‌వాడీ వర్కర్లకు అందజేశారు. ఆయా సెంటర్ల తాళాలను అప్పట్లో వారు పగలగొట్టడంతో కొత్త తాళం కప్పను తీసుకుని సూపర్‌వైజర్లకు అందజేశారు. ఇన్నిరోజులుగా సమ్మెలో ఉండడంతో మంగళవారం ఆయా సెంటర్లలో విధి నిర్వహణ జరపలేదు. దీంతో అంగన్‌వాడీలు సెంటర్లను శుభ్రం చేసుకుని స్టాక్ సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. బుధవారంనుంచి వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొని మహిళా శిశు సంక్షేమశాఖ తరుపున స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తారని పీడీ ప్రవీణ తెలిపారు.

జీజీహెచ్‌లో పీఆర్‌పీ చికిత్సా విధానం

- ప్రత్యేక గదులను ప్రారంభించిన సూపరింటెండెంట్ లావణ్యకుమారి

జీజీహెచ్(కాకినాడ), జనవరి 23: కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్స్ విభాగంలో తొలిసారిగా ప్లేట్లెట్ రిచ్ ప్లాస్మా (పీఆర్‌పీ) చికిత్సా విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ఆర్థో హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక ఎముకల నొప్పులతో బాధపడేవారికి స్టెరాయిడ్స్ లేదా ఇతర హానికర మందులు కాకుండా బాధితుడి సొంత రక్తం నుంచే తయారు చేసిన ప్లేట్లెట్ రిచ్ ప్లాస్మాను సేకరించి బాధితుడికి ఇంజక్షన్ల రూపంలో ఇవ్వడం ద్వారా నొప్పినుంచి పూర్తి ఉపశమనం కలిగించడమే ఈ పీఆర్‌పీ చికిత్సా విధానమన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ప్రకృతి వైపరీత్యాలు లేదా రోడ్డు ప్రమాదాలు లాంటి అత్యవసర సమయాల్లో ఎముకలు విరిగిన బాధితులను ఆస్పత్రికి తరలించి వారి గాయాల తీవ్రత పెరగకుండా భద్రత చేకూర్చే అధునాతన పరికరాలను సూపరింటెండెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ పుష్కరావ్, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, ఆర్థో ప్రొఫెసర్లు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ముఖర్జీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాంకిషోర్ పాల్గొన్నారు.



పీఆర్‌పీ విభాగాన్ని ప్రారంభిస్తున్న, లావణ్యకుమారి

జిల్లా ఉపాధి కార్యాలయంలో

రేపు జాబ్‌మేళా

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 23: కాకినాడలోని జిల్లా ఉపాధి కార్యాలయం ఈనెల 25వతేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వారి సర్టిఫికెట్లతో గురువారం ఉదయం 10గంటలనుంచి కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 08842 373270, 9652142169 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, తదితరులు

కాకినాడ సిటీ, జనవరి 23: వైఎస్సార్ ఆసరా పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు నిధులు విడుదలైనట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఆసరా పథకం నాల్గవవిడత నిధుల విడుదల కార్యక్రమాన్ని సీఎం జగన్ మంగళవారం అనంతపురంలో ప్రారంభించారు. ఈ కార్యక్ర మానికి వర్చువల్‌గా కాకినాడ కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ, కలెక్టర్ కృతికాశుక్లా, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి.. అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాల్గవ విడతలో 37,525 గ్రూపులకు రూ.300.47కోట్ల లబ్ధి జరుగుతోందన్నారు. వచ్చే రెండువారాల్లో మండలాలవారీగా ఈ సొమ్ము పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో జమవుతుందన్నారు. మహిళలకు ఆర్థిక సాధికారిత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధప్రాంతాలనుంచి పాల్గొన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేశారు. ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, మెప్మా పీడీ ప్రియంవద పాల్గొన్నారు.

ఏసీబీ వలలో జలవనరుల చేపలు

- కాకినాడలో రూ.16వేలు లంచం తీసుకుంటూ దొరికిన ఈఈ, జూనియర్ అసిస్టెంట్

కాకినాడ క్రైం, జనవరి 23: జలవనరులశాఖలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకున్న సబార్డినేట్ నుంచి లంచం డిమాండ్ చేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ), జూనియర్ అసిస్టెంట్‌లను ఏసీబీ అధికారులు మంగళవారం రూ.16వేలు తీసుకుంటుండగా పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ డి.శ్రీహరిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కో నసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన పలివెల త్రిమూర్తులు కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్నప్రగతి భవనంలోని జలవనరులశాఖ, డ్రైనేజ్ డివిజన్(మురుగు కాలవల విభాగం)లో హెల్పర్‌గా పనిచేసి స్వచ్ఛంద విరమణ పొందాడు. అతడు ముందస్తు పెన్షన్ మంజూరుకు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఏడుకొండలు, జూనియర్ అసిస్టెంట్ కొల్లాటి స్వామిల కలవగా రూ.20వేలు డిమాండ్ చేశారు. త్రిమూర్తులు అంత ఇచ్చుకోలేనని ఈఈని ప్రాధేయపడడంతో రూ.16వేలు లంచం ఇచ్చేందుకు బేరం కుదిరింది. కానీ తనను ఆఫీస్ చుట్టూ కాళ్లరిగేలా తిప్పినవారిని వదలకూడదని త్రిమూర్తులు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో కాకినాడ జిల్లా జలవనరులశాఖ కార్యాలయం డ్రైనేజ్ డివిజన్‌లో ఈఈ ఏడుకొండలు ఆదేశాల మేరకు మంగళవారం జూనియర్ అసిస్టెంట్ కొల్లాటి స్వామి రూ.16వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు బృందం ప క్కా పథకం ప్రకారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని ఏసీబీ అధికారులు కా ర్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం నిం దితులను ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు డి.వాసుకృష్ణ, వై.సతీష్, బి.శ్రీనివాసరావ్ పాల్గొన్నారు.



పట్టుబడిన ఈఈ, జూనియర్ అసిస్టెంట్

రెండు రోజుల్లో అన్నారు.. ఆరు నెలలు దాటింది



గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పట్టుపరిశ్రమల శాఖ సముదాయం

- ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించేదెన్నడో?
- ఉపాధి నిధుల విడుదల నిలిపివేత
- ఆవేదనలో పట్టురైతులు

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం, జనవరి 23: రెండు రోజుల్లో బకాయిల మొత్తం చెల్లించేస్తామన్నారు. ఆరు నెలలు దాటిపోయింది. ఇంకా ఇన్సెంటివ్‌లు రైతుల ఖాతాలకు జమ కాలేదు. పట్టుషెడ్ల నిర్మాణానికి ఉపాధి నిధులు విడుదల నిలిపివేశారు. గతంలో నిర్మించుకున్న వారికి నిధులు మాటే ఎత్తడం లేదు. ఫలితంగా పట్టురైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సెరీకల్చర్ రంగం నిర్లక్ష్యానికి గురవుతోంది. పట్టురైతులకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాలు చెల్లించకపోగా, ఉపాధి నిధుల విడుదలను అటకెక్కించారు. ఇప్పటికే పట్టుసాగులో అష్టకష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆశనిపాతంలా పరిణమించింది.

పట్టుగూళ్లు విక్రయించిన రైతులకు కిలోకు రూ.50 వంతున రాష్ట్ర ప్రభుత్వం ఇన్సెంటివ్ చెల్లించాల్సి ఉంటుంది. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఈ ప్రోత్సాహకాన్ని క్రమం తప్పకుండా చెల్లించేవారు. నాలుగేళ్లుగా జిల్లాలోని పట్టురైతులకు ఈ ఇన్సెంటివ్‌ను చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు పట్టు మార్కెట్ ద్వారా పట్టుగూళ్ల క్రయ, విక్రయాలు జరిపిన రైతులకు రూ.2.5కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయి. నాలుగేళ్ల బకాయిలు చెల్లించాలంటూ పలుమార్లు రైతులు ఆందోళనలు నిర్వహించారు. అయినా ప్రభుత్వంలో కనీస స్పందన కొరవడింది. పట్టు సాగును నిలిపివేయాలని ఒక దశలో రైతులు భావించారు. చిన్న రీలర్లకు చెల్లించే ఇన్సెంటివ్‌ల బకాయిలు పేరుకుపోయాయి. కాకినాడ జిల్లా పట్టు రైతులు హనుమాన్ జంక్షన్, కదిరి, మదనపల్లి, హిందూపురం తదితర ప్రాంతాల్లో విక్రయించిన పట్టుగూళ్లకు సంబంధించి ఇన్సెంటివ్‌లన్నీ కలిపి రూ.8 కోట్లవరకూ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నట్లు సమాచారం.

పవన్ వస్తున్నారని..

పట్టురైతుల బకాయిలు పేరుకుపోయిన విషయాన్ని తెలుసుకున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆరునెలల క్రితం పిఠాపురం నియోజకవర్గ పర్యటనలోభాగంగా వారితో సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. దీంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. వెంటనే రైతుల వద్దకు పట్టుపరిశ్రమల శాఖ ఉన్నతాధికారులను పంపింది. 48గంటల్లోగా ఇన్సెంటివ్ బకాయిలు చెల్లిస్తామని, పవన్ వద్దకు వెళ్లవద్దని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. పట్టుపరిశ్రమశాఖ కమిషనరేట్ అధికారులతోనూ మాట్లాడించారు. రైతులు యథావిధిగా పవన్‌తో సమావేశమయ్యారు. అప్పట్లోనే ప్రభుత్వ తీరును పవన్ ఎండగట్టారు. పవన్ సమావేశం అనంతరం పట్టురైతులను ఎవరూ పట్టించుకోలేదు. ఆరునెలలు గడిచినా ఇన్సెంటివ్ బకాయిల సంగతిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పట్టురైతులు, రీలర్లు ఆందోళన బాటపట్టారు. సమ్మె పాటిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా చేబ్రోలులోని సెరీకల్చర్ ఫారమ్‌వద్ద పట్టురైతులు ధర్నాలు నిర్వహించారు. అయినా ప్రభుత్వంలో కదలిక కనబడడం లేదు. ప్రభుత్వం 10శాతం బకాయిలను మాత్రమే వివరాలు లేకుండా కొందరి రైతులకు ఇటీవల జమచేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిల సంగతి ఇంకా తేల్చ లేదు. అస లు ఇన్సెంటివ్ బకాయిలు ఇచ్చే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఉన్న ట్లు కనబడడం లేదని పలువురు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఉపాధి నిధులకు గండి కొట్టారు

పట్టుగూళ్ల షెడ్లకు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులకు ప్రభుత్వం గండి కొట్టింది. 2014-19 సంవత్సరాల మధ్య కాలంలో పట్టుషెడ్ల నిర్మాణం యూనిట్ వ్యయం రూ.10లక్షలు ఉండగా, అందులో ఉపాధి నిధులను రూ.6లక్షలు ఇచ్చేవారు. మరో రూ.2లక్షలు కేంద్ర ప్రభుత్వం, రూ.లక్షను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చేది. షెడ్డు నిర్మించుకునే లబ్ధిదారుడి వాటా కేవలం లక్ష రూపాయిలుగా ఉండేది. రూ.9లక్షలు నూరుశాతం ప్రభుత్వం నుంచి సమకూరుతుండడంతో రైతులు ఎక్కువ మంది షెడ్లు నిర్మించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి నిధులు కేటాయింపు రూ.6లక్షలు నుంచి రూ.3.14లక్షలకు తగ్గించారు. ఆ నిధులు కూడా రైతులకు ఇవ్వడం లేదు. మరోవైపు కేంద్రం ఇచ్చే రూ.2లక్షలు తక్షణం రైతుల ఖాతాకు జమవుతుండగా రాష్ట్ర ప్రభుత్వ వాటా మాత్రం రావడంలేదు. నాలుగున్నరేళ్లుగా ఉపాధి నిధులు, రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల కాకపోవడం, లబ్ధిదారుడి వాటా 300 శాతంపైగా పెరగడంతో పట్టు రైతులు షెడ్ల నిర్మాణంపై ఆసక్తి చూపడం లేదు. పట్టురైతులకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ బకాయిలు ఇవ్వకపోగా మిగిలిన ప్రోత్సాహకాలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం తగ్గిస్తూ వస్తుండడంతో పట్టుసాగు వైపు మొగ్గు చూపే రైతులు వెనుకంజ వేస్తున్నారు.

నేటి నుంచి 'నిజం గెలవాలి' కార్యక్రమం

చంద్రబాబు అరెస్టు సమయంలో చనిపోయిన వారి కుటుంబాలకు నారా భువనేశ్వరి పరామర్శ

ఉమ్మడి జిల్లాలో మూడు రోజుల పర్యటన



కాకినాడ సిటీ, జనవరి 23: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టుతో వేదనకు గురై కొంతమంది మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించేందుకు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి..' కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధించిన సమయంలో వేదనకు గురై అశువులు బాసిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఆర్థిక సాయం అందించనున్నారు.

మూడురోజుల పాటు పర్యటన

24న కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం, 25న అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం, 26న రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో పర్య టించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 11.30 గంటలకు భువనేశ్వరి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి 12.30 గంటలకు జగ్గంపేట మండలం గుర్రపాలెం, 1.25 గంటలకు పెద్దాపురం మండలం కాండ్రకోట, సాయంత్రం 4.05 గంటలకు తుని రూరల్ మండలం తేటగుంట, 5.20 గంటలకు కాకినాడలోని 26వ డివిజన్‌లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. రాత్రికి ముమ్మిడివరం నియోజకవర్గం మహిపాల చెరువువద్ద జాతీయ రహదారి పక్కన గ్రాండ్ పార్క్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బస చేస్తారు. 25న గురువారం ఉదయం 10.30 గంటలకు పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెం, 11.45 గంటలకు అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి, 12.25 గంటలకు అల్లవరం మండలం రెల్లుగడ్డ, 2.40 గంటలకు రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం, సాయంత్రం 5.25 గంటలకు మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలం నల్లూరు, 6.20 గంటలకు మండపేట మండలం పాలతోడు గ్రామంలో పర్యటిస్తారు. రాత్రికి అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం చేరుకుని ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బస చేస్తారు. 26న శుక్రవారం ఉదయం 10.25గంటలకు బిక్కవోలు, 12.40 గంటలకు నిడదవోలు మండలం పందలపర్రు, 1.20 గంటలకు తిమ్మరాజుపాలెం, 1.55 గంటలకు తాడిమళ్ల, 3.15 గంటలకు గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి, సాయంత్రం 4.30 గంటలకు రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం కాటవరంలో పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు మధురపూడి విమానాశ్రయం నుంచి ఆమె హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

మహిళా వాలీబాల్ పోటీల విజేత
సౌత్ సెంట్రల్ రైల్వే



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

మలికిపురం, జనవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెంలో నాలుగు రోజులు పాటు జరిగిన జాతీయ మహిళా వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం అర్ధరాత్రి ముగిసింది. సౌత్ సెంట్రల్ రైల్వే టీమ్ విజేత కాగా ఐసీఎఫ్ టీమ్ ద్వితీయ స్థానంలో, కేరళ పోలీసు టీమ్ తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎస్పీ ఎస్.శ్రీధర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జాతీయ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించిన ఏసీఎఫ్ ఫౌండేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చైర్మన్ అడబాల వేణుగోపాల్, అడబాల బ్రహ్మాజీ, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, అడబాల తాతకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రంకిరెడ్డి కాశీ, అల్లూరి రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం

ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ



చంద్రబాబు సాగర్‌ను పరిశీలిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి23: ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు చెందిన సాగునీటి ప్రాజెక్టులు అనేక సమస్యల్లో చిక్కుకుని నిరుపయోగంగా మారాయని, దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. నియోజకవర్గంలోని ఏలేరు సాగునీటి ప్రధాన జలాశయంతో పాటు సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబు సాగర్ ప్రాజెక్టులను మంగళవారం ఆమె టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ ప్రాజెక్టులు అధ్వాన తీరు పట్ల సత్యప్రభ నాయకత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని కనీస మరమ్మత్తులకు నోచుకోలేదని అన్నారు. చంద్రబాబు సాగర్‌కు రెండు దశాబ్దాలుగా కాలువల ఏర్పాటు జరగలేదన్నారు. సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టుకు వరదల సమయంలో పడిన గండ్లు పూడ్చలేదని, ఏలేరు ప్రాజెక్టు ఆధునికీకరణకు నోచుకోలేదని రాజ్యాంగ సమస్యల పరిష్కారం కోసం తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం జగన్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మెట్ట ప్రాంత రైతులకు శాపంగా మారిందని సత్యప్రభ దుయ్యబట్టారు. అనంతరం ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో నియోజకవర్గ టీడీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, బొల్లు కొండబాబు, జల్లిగంపల ప్రభాకరరావు, బొదిరెడ్డి గోపాలకృష్ణ, సూది బూరయ్య, మిరియాల శ్రీను, బొండాడ నారాయణ, బొల్లు వెంకటేశ్వరరావు, రొంగల సత్యనారాయణ, తటవర్తి సుబ్బారావు, లొండా లోవరాజు, సూది ప్రభాకర్, రావూరి తాతాజీ, రామిశెట్టి మున్నిబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు భరోసాతో..

గిరిజన యువతలో చిగురిస్తున్న ఆశలు!

గిరిజన ప్రాంతాల్లో నూరుశాతం ఉద్యోగాలు

గిరిజనులకేనన్న బాబు

జీవో 3 పునరుద్ధరణకు అరకు సభలో హామీ

(రంపచోడవరం): జగన్ ప్రభుత్వ తీరుతో నైరాశ్యంలో ఉన్న గిరిజన యువతకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పర్యటన ఉద్యోగ భరోసాను కల్పించి కొత్త ఆశలను చిగురింపజేసింది. ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో నిర్వహించిన 'రా కదలి రా' కార్యక్రమంలో జీవో నంబరు 3 పునరుద్ధరణకు చంద్రబాబు హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని ఉద్యోగాలూ గిరిజనులకే దక్కేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం దివంగత ఎన్టీరామారావు సారథ్యంలో 1986లోనే నడుం బిగించింది. అన్ని ఉపాధ్యాయ పోస్టులూ గిరిజనులతోనే భర్తీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ పలు కేసులు నడిచాయి. తెలుగుదేశం ప్రభుత్వం కూడా అంతే ధీటుగా గిరిజనులకు అండగా నిలిచి సుప్రీంకోర్టు వరకూ పోరాడింది. రాజ్యాంగపరంగా గిరిజనులకు అండగా ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని 2000 సంవత్సరంలో అన్ని ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులకే దక్కే విధంగా జీవో నెం.3ను తీసుకొచ్చి, 1986 నుంచి వర్తించేలా గిరిజన యువతకు రక్షణ కల్పించింది. ఇదే పరంపరను క్రమేణా అన్ని పోస్టులకు వర్తింపచేస్తూ వచ్చారు. అనేక నియామకాలు ఆ జీవో పరిధిలోనే చేపడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉండే గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచుతూ వచ్చారు. ఆ జీవోపై కూడా పలు కేసులు దాఖలయ్యాయి. మూడు దశాబ్దాల కాలంగా గిరిజన యువత ఉద్యోగాలకు భరోసాగా నిలిచిన ఆ జీవోపై చేబ్రోలు లీలా ప్రసాదరావు కేసులో ప్రభుత్వ వైఫల్య వాదనల కారణంగా చివరకు 2020 ఏప్రిల్‌లో ఆ జీవో సుప్రీంకోర్టులో వీగిపోయింది. ఆ తీర్పుతో గిరిజన యువతకు గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం ఉద్యోగ భరోసా ప్రశ్నార్థకమైంది. జనాభా ప్రాతిపదికన కేవలం 6నుంచి 7శాతం మాత్రమే గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు గిరిజనులకు దక్కే దుస్థితి కలిగింది. గిరిజనులకు అండగా నిలవాల్సిన వైసీపీ ప్రభుత్వం ఆ జీవోను పునరుద్ధరించే దిశగా సరైన చర్యలు తీసుకోలేకపోయింది. ఈ పరిస్థితుల్లో విద్యావంతులైన గిరిజన యువత ప్రభుత్వ నియామకాలు పొందలేని స్థితిలో మైదాన ప్రాంతాలకు వలసపోతూ చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా లేక గిరిజన యువత దిక్కుతోచని స్థితిలో కుంగిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో శనివారం అరకులోయకు వచ్చిన చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించి తమ ప్రభుత్వం గిరిజన యువతకు నూరుశాతం ఉద్యోగ భరోసా కల్పిస్తూ ఇచ్చిన జీవోను జగన్ ప్రభుత్వం కాపాడలేకపోయిందని, తద్వారా గిరిజన యువత భవిష్యత్‌ను దెబ్బతీసిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే జీవో 3 పునరుద్ధరణకు అవసరమైన చట్టపరమైన చర్యలన్నిటినీ తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో గిరిజన యువతలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కాగా, జీవో 3 పునరుద్ధరణ హామీ ద్వారా గిరిజన యువతకు తమ పార్టీ భరోసా కల్పిస్తోందని, భవిష్యత్‌కు గ్యారంటీ విధానంలోనే గిరిజన యువతకు చంద్రబాబు అండగా నిలుస్తున్నారని టీడీపీ సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేశ్, వంతల రాజేశ్వరి తెలిపారు.

గుండెపోటుతో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రభుత్వం, పోలీసుల బెదిరింపులే కారణమంటున్న సంఘం నేతలు



శేషారత్నం



నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు

మండపేట, జనవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరంలో అంగన్వాడీ వర్కర్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.... కేశవరానికి చెందిన అంగన్వాడీ వర్కర్ చంద్రమళ్ల శేషారత్నం (50) సోమవారం 'చలో విజయవాడ'కు బయల్దేరింది. ఆ సమయంలో ఆమెతో పాటు పలువురు అంగన్వాడీలను మండపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఇప్పనపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాయంత్రం విడిచిపెట్టారు. సమ్మె చేస్తున్న వారిపై ఆంక్షలు విధించడం, విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం, పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పుడు నాన్‌బెయిలబుల్ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తామని బెదిరించడంతోనే శేషారత్నం ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందిందని సహచర అంగన్వాడీలు చెబుతున్నారు. శేషారత్నం మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. శేషారత్నం మరణ వార్త తెలిసిన వెంటనే సీఐటీయూ, అంగన్వాడీ నాయకులు ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యేనని అంగన్వాడీలు ఆరోపించారు. శేషారత్నం కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొని ఆందోళనకు గురై రాష్ట్రంలో మరణించిన అంగన్వాడీల కుటుంబాలకు న్యాయం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ కాకినాడ జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసుల వేధింపుల కారణంగానే శేషారత్నం మృతి చెందిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి ఆరోపించారు. శేషారత్నం మృతి పట్ల అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు బేబి, పద్మ, ఎంపీపీ ఉండమట్ల వాసు, దూలం వెంకన్నబాబు, ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి సంతాపం తెలిపారు.

సంక్షేమ పథకాలకు కేంద్రం చేయూత

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భాగెల్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ భాగెల్

నిడదవోలు, జనవరి 23: కేంద్రం రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలకు నిధులు అందించి చేయూతనందించిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భాగెల్ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాష్ట్రాల్లో వంద శాతం నిధులతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఒకప్పుడు గ్యాస్ కనెక్షన్ కోసం నెలలు తరబడి వేచి ఉండేవారని ఇప్పుడు అడిగిన వెంటనే గ్యాస్ కనెక్షన్ అందిస్తున్నామన్నారు. దేశంలో స్వచ్ఛ భారత్ ద్వారా పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పేదలు అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, మండలాధ్యక్షుడు మాట్ల వెంకటదుర్గారావు, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధ, రేలంగి శ్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమర్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లవకుశలో నటించడం పూర్వజన్మ సుకృతం



కుశుడు పాత్రధారి(మధ్యలో)

పెద్దాపురం, జనవరి 23 : సంచలనాత్మక పౌరాణిక చిత్రం లవకుశలో కుశుడు పాత్రలో తాను నటించడం తన పూర్వ జన్మ సుకృతమని కుశుడు పాత్రధారి వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని ప్రముఖ న్యాయవాది చిటికిన కనకదుర్గారావు ఇంటికి వచ్చిన నాగసుబ్రహ్మణ్యం పాత్రికేయులతో మాట్లాడారు. లవకుశ సినిమాలో నటించిన వారందరూ మరణించగా తాను మాత్రమే జీవించి ఉన్నానన్నారు. తన సోదర పాత్రధారి అయిన నాగరాజు లవుడు పాత్రలో తనతో గట్టిగా పోటీపడ్డారన్నారు. ఆయన కూడా మరణించడం తనకు ఎక్కువ బాధను కలిగించిందన్నారు. లవకుశ సినిమా తర్వాత సీతా రామ కల్యాణం, వెలుగునీడలు, శ్రీవెంకటేశ్వర మహత్యము సినిమాలలో నటించిన తర్వాత వెండితెరకు దూరమయ్యానన్నారు. బతుకుదెరువు కోసం బుర్రకథలు చెప్పడం ప్రారంభించి సుమారు పది వేల బుర్రకథలు చెప్పి నాజర్ తర్వాత ద్వితీయ రికార్డును సాధించానన్నారు. ఒక దశలో తాను మరణించానని సామాజిక మాధ్యమాలలో ప్రసారం జరిగిందని ఆ దశలో లవకుశలమైన నాగరాజు తాను పత్రికల ద్వారా తిరిగి వెలుగులోకి వచ్చి అనేక సన్మానాలు పొందామన్నారు. పుట్టా సోమన్నచౌదరి, చిట్టెం హరిగోపాలశర్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్కంఠగా లాన్ టెన్నిస్ పోటీలు



హోరాహోరీగా టెన్నిస్ పోటీ జరుగుతున్న దృశ్యం

కాకినాడ రూరల్, జనవరి 23: 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలు 4వ రోజు మంగళవారం ఉత్కంఠగా కొనసాగాయి. 19 సంవత్సరాలలోపు బాలురకు నిర్వహిస్తున్న ఈపోటీలు బుధవారం ముగియనున్నాయని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు కాకినాడ డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలోగల స్మార్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుక గల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయి. మొత్తం 18 మ్యాచ్‌లు నిర్వహించగా సెమీఫైనల్ మ్యాచ్‌లో రిషీవర్ధన్ (కర్ణాటక)పై వహీన్‌పటేల్(గుజరాత్) 7-5 స్కోర్‌తో విజయం సాధించాడు. అర్జున్‌రాఠీ(హర్యానా) జాన్‌రోహన్(తమిళనాడు)పై 6-4 స్కోర్ తేడాతోనూ, తెలంగాణకు చెందిన శాండిల్య, అవాంపారిక్(గుజరాత్‌పై)7-5 స్కోర్‌తోనూ గెలుపొందారు. మొదటి సెమీఫైనల్‌లో తెలంగాణకు చెందిన ధీరజ్ గెలుపొందగా అర్జున్‌రాఠీ (హర్యానా), ధీరజ్ (తెలంగాణ) మధ్య బుధవారం ఫైనల్‌మ్యాచ్ జరగనుంది, ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన క్యాంప్‌ఫైర్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన లాన్‌టెన్నిస్ క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లాన్ టెన్నిస్ జాతీయ పరిశీలకులు రామిరెడ్డి విచ్చేసి మ్యాచ్‌లను తిలకించారు. పోటీలను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర చైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్, అఫీషియల్స్ కె.శ్రీకుమార్, డీవైఈవోలు డేనియల్‌రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్ కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పుల్లయ్య, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీఈటీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు, వెంకటేష్, త్రిపుల, భానుమతి, శ్రీనివాస్, సువర్చల, మేరీ విజయ, తులసి, సత్యగౌరి, శ్రీలక్ష్మి, శ్రీహరిరాజు, హుస్సేన్, ప్రసాదరావు పర్యవేక్షించారు.

గిరిజన రైతుకు సత్కారం



గిరిజన రైతును సత్కరిస్తున్న దృశ్యం

కొవ్వూరు, జనవరి 23: టిష్యూ కల్చర్ గ్రాండ్‌నైన్ అరటి రకాన్ని శాస్త్రీయ విధానంలో సాగుచేసి అధిక దిగుబడులు సాధించిన గిరిజన రైతు ఎస్.కన్నప్పరాజును ఉత్తమ లబ్ధిదారుడిగా ఎంపిక చేసి సత్కరించినట్లు కొవ్వూరు వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త జి.రామానందం తెలిపారు. గుజరాత్‌లోని నవసారి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధన పథకం 11వ సదస్సు జరుగుతుందన్నారు. ఈ పథకంలో 2022-23లో నిర్వహించిన పరిశోధనా ఫలితాలపై సమీక్షించి చేపట్టవలసిన కార్యాచరణపై మంగళవారం ఆయన పరిశోధన కేంద్రంలో దిశ నిర్దేశం చేశారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద గిరిజన రైతుల్లో శాస్త్రీయ సాగు విధానంలో ప్రోత్సాహానికి ఆర్థిక సహాయం, నాణ్యమైన మొక్కలు, పోషకాలు, పురుగుల మందులు, సూక్ష్మ పోషకాలు, స్ప్రేయర్స్ అందిస్తోంది. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం లంకలపల్లికి చెందిన గిరిజన రైతు ఎస్.కన్నప్పరాజు టిష్యూ కల్చర్ గ్రాండ్‌నైన్ అరటి రకాన్ని శాస్త్రీయ విధానంలో సాగుచేసి రూ.4.5 లక్షల నికర ఆదాయాన్ని పొందారు. దీంతో కన్నప్పరాజును ఉత్తమ లబ్ధిదారుడిగా ఎంపిక చేసి నవసారి వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి జేబీ సబేల్, ఐసీఏఆర్ ఏడీజీ డాక్టర్ వీబీ పాటిల్, వైఎస్‌ఆర్‌హెచ్‌యూ రిటైర్డ్ ఉపకులపతి బీఎంసీ రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్ పాటిల్ సత్కరించారు. కన్నప్పరాజును ప్రోత్సహించిన కొవ్వూరు వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను అభినందించారు.

నర్సరీని సందర్శించిన అంజనాసిన్హా



మొక్కలను పరిశీలిస్తున్న అంజనాసిన్హా

కడియం, జనవరి 23: కడియపులంక పుల్లా ఆంజనేయులు(అబ్బులు)-సత్యదేవా నర్సరీని మంగళవారం జాతీయ రహదారుల సంస్థ డీజీ అంజనాసిన్హా సందర్శించారు. ఆమెకు నర్సరీ అధినేత పుల్లా అబ్బులు 'జామియా' అనే మొక్కను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా నర్సరీలోని పలు మొక్కలు, వాటి శాస్త్రీయ నామాలు, పెరిగే తీరు, పెంపకం వంటి విషయాలను అబ్బులు కుమారుడు వీరబాబు వివరించారు. కాగా రహదారుల పరిస్థితి బాగా లేదని, మొక్కల రవాణా జరిగే ఈ ప్రాంతంలో రోడ్లు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు అంజనాసిన్హా దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళతామని ఆమె తెలిపారు.

ఆ మూడు డిగ్రీ కోర్సులు ఏఐసీటీఈ పరిధిలోకి రాకుండా చూడాలి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దివాన్‌చెరువు, జనవరి 23: అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) పరిధిలోకి బీబీఏ, బీసీఏ, బీహెచ్‌ఎం కోర్సులను తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు తీర్మానం చేశారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో డిగ్రీ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, విశ్వవిద్యాలయాలు తమ సార్వభౌమాధికారాన్ని కోల్పోతాయన్నారు. అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ చొరవ తీసుకుని సదరు మూడు డిగ్రీ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి వెళ్లకుండా చూడాలని కోరుతూ అసోసియేషన్ సభ్యులు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి పద్మరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ సభ్యుడు గంధం నారాయణరావు, నన్నయ వర్సిటీ ఎఫిలియేటెడ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, అధ్యక్షుడు కేవీఆర్ఎస్ నరసింహారావు, మల్లిడి అనంతరెడ్డి, బర్ల సత్యనారాయణ, సాంబశివరావు, గంగిరెడ్డి, గణేష్ చౌదరి వివిధ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వర్క్‌షాపు

నన్నయ యూనివర్సిటీలో సామాజిక ఇంజనీరింగ్ యాక్సెస్, చేరిక యువ సాధికారికత ఉపాధి అనే అంశంపై బుధవారం వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్టు వీసీ కె.పద్మరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ వర్క్‌షాపునకు విశ్వవిద్యాలయ ప్రాంగణాల అధ్యాపకులతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు హాజరు కావాలని కోరారు. వర్క్‌షాపు కన్వీనర్‌గా ఆచార్య కె.శ్రీరమేష్, కోకన్వీనర్‌గా పి.ఉమామహేశ్వరిదేవి వ్యవహరిస్తారని తెలిపారు. వర్క్‌షాపుకు హాజరైన వారికి ఈ-సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

నేటి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

పెద్దాపురం, జనవరి 23: మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు గొందేసి రాజా తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ నాటిక పోటీలను జడ్పీ సీఈవో అబ్బిరెడ్డి రమణారెడ్డి ప్రారంభిస్తారని, అలాగే ముఖ్య అతిథిగా డీఎస్పీ లతాకుమారి హాజరవుతారన్నారు.. ఈ నాటిక పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

వై.రామవరం, జనవరి 23: అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆదేశాలతో వై.రామవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. గంజాయి తరలిస్తున్న వారిలో ఒకరు మైనర్ కాగా మిగిలిన ఇద్దరు కాకినాడకు చెందిన ద్రాక్షారపు ఉమాశంకర్, వై.రామవరం మండలం పాతకోట పంచాయతీ రాచమెట్టకు చెందిన కొర్ర ఆనందరాజులుగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. ఒడిసా నుంచి యార్లగడ్డ మీదుగా గంజాయిని తరలిస్తున్నారని రూ.66 వేలు విలువచేసే 22 కిలోల గంజాయిని, పల్సర్‌బైక్‌ను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు వైసీపీ వార్డు మెంబర్లు టీడీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వంతల

ఎటపాక, జనవరి 23: ఎటపాక మండలం, పురుషోత్తపట్నం పంచాయతీలోని వైసీపీకి చెందిన నలుగురు వార్డు మెంబర్లతో పాటు గ్రామానికి చెందిన న్యాయవాది, పలు కుటుంబాలకు చెందిన వారు మంగళవారం టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్‌బాబు జెండా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మాట్లాడారు. మరో మూడు నెలలో వైసీపీ పాలన ముగుస్తుందని, రానున్నది చంద్రబాబు స్వర్ణయుగమని చెప్పారు. ఆరు గ్యారెంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని అన్నారు. అంతకు ముందు ఆమె పురుషోత్తపట్నంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, సున్నం వెంకటరమణ, మాచినేని రాజేష్ పాటి చలపతి, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అయోధ్యలో రామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న యశోద ఆస్పత్రి చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథ రామిరెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి...

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

కలెక్టర్‌ను కలిసిన అధికారులు

కాకినాడ సిటీ, జనవరి 23: సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ అర్బన్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.చల్లన్నదొర కలెక్టర్ కృతికాశుక్లాను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏలూరు కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఏపీఈడబ్ల్యుఐడీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ అదనపు బాధ్యతలతో కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.వెంకటరాజు కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు.



సర్పవరంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పెంకే శ్రీనివాస బాబా, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్


సామర్లకోట: కేక్ కట్ చేసి పలువురికి అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప


జిల్లా టీడీపీ కార్యాలయంలో చిక్కాలకు కేక్ తినిపిస్తున్న కొండబాబు


తునిలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అట్టహాసంగా లోకేష్ జన్మదిన వేడుకలు


గొల్లప్రోలు: తాటిపర్తిలో కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

కాకినాడసిటీ, జనవరి23: వైసీపీ అరాచక పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై యువనేత నారా లోకేశ్ 3వేల కిలోమీటర్లకుపైగా యువగళం పాదయాత్ర చేసి యువతకు, మహిళలకు, ప్రజలకు భరోసా కల్పించారని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం కొండబాబు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు పేరాబత్తుల రాజశేఖర్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, పలివెల రవి, గుత్తుల రమణ, ఎస్కే రహీమ్, గాది శివరామకృష్ణ, వాసిరెడ్డి చిట్టిబాబు, గుజ్జు బాబు, ఎండీ జిలాని, బలరాం, రెడ్నం సత్తిబాబు పాల్గొన్నారు.

500మందికి అన్నదానం

నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మంగళవారం కాకినాడజిల్లా తెలుగు మహిళాధ్యక్షురాలు సుంకర పావని ఆధ్వర్యంలో సంతచెరువు సెంటర్ ఎన్టీఆర్ విగ్రహంవద్ద కేక్ కట్‌చేసి 500మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర మాజీ అధ్యక్షుడు నున్న దొరబాబు, మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల బుచ్చి, పార్టీ నాయకులు సుంకర తిరుమలకుమార్, పెనుపోతు తాతారావు, బొబ్బిలి గోవిందు, కామాడి దశరథ పాల్గొన్నారు.

సానా సతీష్‌బాబు ఫౌండేషన్ కార్యాలయంలో..

శాంతినగర్‌లోని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ కార్యాలయంలో నారాలోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేట్ కట్ చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో నిడదవోలు వీరేంద్ర, జహరుద్దీన్ జిలాని, గుత్తుల రమణ, నిర్మల్ చంద్, వెన్నపు చక్రధరరావు, జోగారాజు, బొబ్బిలి గోవిందు, కోటిపల్లి సతీష్ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడరూరల్ మండలంలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా ఆధ్వర్యంలో విద్యుత్‌నగర్ చల్లా ఫంక్షన్‌హాల్లో కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించి 30యూనిట్ల రక్తాన్ని రోటరీక్లబ్‌కు అందించారు. 150 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీచేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● సర్పవరం జంక్షన్‌లో స్పందన ఫంక్షన్ హాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి వెంకటప్రభాకర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మహిళలకు చీరలు, ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ చొక్కాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీలు పంపిణీ చేశారు. అనంతరం మొబైల్ అన్నా క్యాంటీన్ ద్వారా ఆహారం పంపిణీ చేశారు. ముందుగా భారీ కేకు కట్‌చేసి కార్యకర్తలకు అందించారు. పై రెండు కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పేరాబత్తుల రాజశేఖర్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, రాందేవు సీతయ్యదొర, పలివెల త్రిమూర్తులు తదితర నాయకులు పాల్గొన్నారు. వలసపాకల మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి నివాసంలో కుమారుడు కల్యాణ్‌కృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

సామర్లకోట: మండలంలోని అచ్చంపేటలోని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వగృహంలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమక్షంలో ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ యూత్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను ఎమ్మెల్యే చినరాజప్ప కట్ చేసి పలువురికి అందించారు. సామర్లకోట పట్టణ పరిధిలో పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలచే నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి పలువురు కార్యకర్తలకు అందజేశారు.

జగ్గంపేట: టీడీపీ ఆధ్వర్యంలో జాతీయ టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, క్లస్టర్ ఇన్‌చార్జ్ జీను మణిబాబు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, వేములకొండ బాబుయాదవ్, డేగల సత్తిబాబు, నేదురిగణేష్, ఎండీ కాజా, వెలిశెట్టి బుజ్జి, కింగం రామకృష్ణ, సాంబత్తుల చంద్రశేఖర్, తుమ్మల కిషోర్, మారిశెట్టి గంగ, నల్లమాటి ఆనంద్, బండారు నాని, చెలికాని హరిగోపాల్, కుప్పతారావు, కొత్త నాగపండు పాల్గొన్నారు.

తునిరూరల్: టీడీపీ జాతీయ కార్యదర్శి యువనేత నారా లోకేష్ జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులు తునిలో అట్టహాసంగా నిర్వహించారు. తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు.

గండేపల్లి: మండలంలో గండేపల్లి ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంగళవారం టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజువేడుకలు మండల పార్టీ అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో అడబాల భాస్కరరావు, వెలమాటి కాశీ, యర్రంశెట్టి బాబ్జీ, సీలామంతుల వీరబాబు, ఆళ్ళ సత్తిబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, వెంపాటి సతీష్, పంచికట్ల కనకరాజు, వెంపాటి రాజు, కంటిపూడి సత్యనారాయణ, తణుకు దుర్గాప్రసాద్‌యాద్, శ్రీనుబాబు పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి జగపతినగరంలో టీడీపీ మండల అధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో భారీ కేక్ ఏర్పాటు చేసి పలువురికి స్వీట్లు పంచారు. జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి, పలు గ్రామాల టీడీపీ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తూ స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఆళ్ళ శ్రీమన్నారాయణ, గుడాల రాంబాబు, అళ్ళనానాజీ, మద్దాల మణికంఠ స్వామి, బొడ్డేటి లోవ, కట్టునాని, పలువురు ఉన్నారు.

శంఖవరం: మండలంలో నెల్లిపూడి, సీతంపేటలలో మంగళవారం టీడీపీ ఇంచార్జ్ వరుపుల సత్యప్రభ కార్యకర్తలతో కలిసి లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు బద్ది రామారావు, ముదునూరి మురళీరాజు, వెన్నా ఈశ్వరుడు, కీర్తి వెంకటసుభాష్, బచ్చల గంగ, బద్ది రమణ, బద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న సత్యప్రభ

గొల్లప్రోలు: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహంవద్ద కేక్‌ను కట్‌చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, చిట్టూరి సుబ్బారావు, పడాల అప్పారావు, జల్లిగంపల రాంబాబు, గారపాటి సుబ్రహ్మణ్యం, సుబ్బురామకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ఏలేశ్వరం బాలాజీచౌక్ సెంటర్‌లో టీడీపీ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లోకేష్ జన్మదిన వేడుకలు సత్యప్రభ కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, నియోజకవర్గ టీడీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, కొమ్ముల కన్నబాబు, జ్యోతు ల పెదబాబు, సూది బూరయ్య, పెంటకోట శ్రీధర్, పలివెల శ్రీను, జిగటాపు సూరిబాబు, ఎన్. కనకారావు, కర్రి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

రౌతులపూడి: ఎ. మల్లవరంలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడులకుల ఘనంగా నిర్వహించారు. యువ నాయకుడు లెక్కల రాము ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించి స్వీట్లు పంచారు. రౌతులపూడిలో మాజీ సర్పంచ్ పైలా సాంబశివరావు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.


గండేపల్లిలో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు

కాకినాడలో కాంగ్రెస్ రాస్తారోకో

కాకినాడ సిటీ, జనవరి 23: బీజేపీ పాలిత రాష్ట్రాలలో అరాచక పాలనకు రాహుల్‌గాంధీ జూడో యాత్రపై రాళ్ల దాడి పరాకాష్ట అని కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు ధ్వజమెత్తారు. అసోంలో రాహుల్‌గాంధీ జూడో యాత్రపై బీజేపీ ప్రభుత్వం సాగించిన రాళ్ల దాడిని నిరశిస్తూ ఆయన ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ కల్పన సెంటర్‌లో పార్టీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఆకుల వెంకటరమణ, పెద్దాడ సుబ్బారాయుడు, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ప్రసాదవర్మ, పీసీసీ సభ్యుడు కుక్కల పోతురాజు, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

లోకేశ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకల్లో భాగంగా నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓ పేద మహిళకు జీవనోపాధి నిమిత్తం రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆధ్వర్యంలో మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

సారా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కాకినాడ సిటీ, జనవరి 23: జిల్లాలోని యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామం ఎస్సీ కాలనీవద్ద పంచాయతీ రోడ్డుమీద సారా అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని గ్రామ దళితులు జిల్లా అధికారులకు విన్నవించుకున్నారు. ఈ మేరకు దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడి చెంగల్‌రావు ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. తాటాకు బుట్టలు అల్లుకుంటూ, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే తాము గ్రామంలో పంచాయతీ రోడ్డుమీద సారా అమ్మకాల వల్ల రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై గ్రామపెద్దలకు, పంచాయతీ అధికారులకు విన్నవించామని, దీంతో సారా వ్యాపారులు తమను బెదిరిస్తున్నారని వివరించారు.

నల్లమిల్లి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు

కాకినాడ సిటీ, జనవరి 23: పెదపూడి మండలం గండ్రేడులో ఏర్పాటుచేసిన జయహో బీసీ సభా కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పెద్దసంఖ్యలో అనపర్తి నియోజకవర్గ టీడీపీ-జనసేన శ్రేణులు బైక్ ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. పెదపూడి మండలం పైన, రాజుపాలెం, గొల్లల మామిడాడ మీదుగా గండ్రేడు వరకు 12 కిలోమీటర్ల మేర ఈ బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో నల్లమిల్లికి పలు చోట్ల గ్రామస్థులు విజయ సంకేతంతో స్వాగతం పలికారు. గండ్రేడులో నల్లమిల్లి ఆధ్వర్యంలో 300మంది వైసీపీనుంచి టీడీపీలో చేరారు. సభలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, శాసనసభ మాజీ డిప్యూటీ వైస్‌చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, బీసీ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్లు పనులు చేపట్టాలని ఆందోళన

● మునిసిపల్ కార్యాలయ ఆవరణలో బైఠాయింపు

పిఠాపురం, జనవరి 23: రోడ్ల పనులను తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో జగ్గయ్యచెరువుకాలనీ వాసులు మంగళవారం బైఠాయించారు. వీరితోపాటు అధికార వైసీపీ కౌన్సిలరు కావాడి పోశయ్య పలువురు వైసీపీ నాయకులు ఆందోళనలో పాలుపంచుకున్నారు. కాలనీలోని 21వ వార్డు సహా వివిధ ప్రాంతాల్లో రూ.60లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి మునిసిపల్ కౌన్సిల్‌లో నిధులు మంజూరు చేసి టెండర్లు ఖరారు చేశారని పోశయ్య, ఆందోళనకారులు తెలిపారు. పనులు పొందిన కాంట్రాక్టరు సీసీరోడ్డు పనులు చేపట్టడం లేదని, ఎన్నిమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని వివరించారు. తక్షణం రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో మునిసిపల్ అధికారులు వారితో చర్చలు జరిపారు. పనులు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దళితులను దూషించిన ఈఈపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి


రాజుపాలెం ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న దృశ్యం

కిర్లంపూడి, జనవరి 23: మండలంలోని రాజుపాలెం గ్రామంలో మంగళవారం ప్రత్తిపాడు-సామర్లకోట ప్రధాన రహదారిపై దళితులు ఆందోళన నిర్వహించారు. పెద్దాపురం ఈఈ వెంకటేశ్వరరావుపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ ధర్నాకు దిగారు. ఇటీవల రాజుపాలెం నుంచి రామవరం వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ఆయన్ను అడగడంతో ఇరువురి మధ్యఘర్షణ చోటు చేసుకోవడంతో కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఈఈ వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కొంతమంది దళితులపై కేసు నమోదు చేశారు. మేము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయలేదని కొల్లి చంద్రరావు తెలిపారు. సుమారు గంట పాటు ట్రాఫిక్ అంతరాయం కలగడంతో జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో ఆయనపై కేసు నమోదు చేస్తామని తెలపడంతో ధర్నా విరమించారు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 23: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రామలింగేశ్వరుడికి నవహారతులు ఇచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


దుర్గాడలో ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 23: ఆటోడ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 35వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మోటరు వాహనాల తనిఖీ అధికారి(ఎంవీఐ) ఎం.హరినాథరెడ్డి మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే ఆటోడ్రైవర్లు ఓవర్‌లోడ్ లేకుండా తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మోటరు వాహన తనిఖీ అధికారులు ఎస్.గౌరీశంకర్, ఆర్.షణ్ముక శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగ్గంపేటలో ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ నిరసన

జగ్గంపేట, జనవరి 23: మహిళలకు ఉచిత బస్సు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జగ్గంపేట కాకినాడ రోడ్‌లో గల ఆటో యూనియన్ రాజమహేంద్రవరం, ఏలేశ్వరం, గుర్రప్పాలెం, గోకవరంరోడ్డు ఆటో యూనియన్ సభ్యులు జగ్గంపేట సెంటర్లో నిరసన వ్యక్తం చేసి మానహారం నిర్వహించారు. అనంతరం సుమారు 500 మంది యూనియన్ సభ్యులు జగ్గంపేట డిప్యూటీ ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంజేటి సత్యనారాయణ, ప్రెసిడెంట్ అద్దంకి సత్తిబాబు, కిలపర్తి వీరబాబు, రాఘవ రాధాకృష్ణ, కొప్పూరి దొరబాబు, గౌరవ అధ్యక్షుడు గరింత అప్పలరాజు, చీకట్ల నాగరాజు పాల్గొన్నారు.

కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

పిఠాపురం, జనవరి 23: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం పట్టణంలోని కోర్టుల వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారం 56వ రోజుకి చేరాయి. నెలల తరబడి న్యాయవాదులు ఆందోళన చేస్తున్నా, చట్టంపై పలు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేకపోవడం దారుణమని న్యాయవాదులు అన్నారు. ఆందోళనలో న్యాయవాదులు ఎస్ఎం ఆలీ, బంగారు రామకృష్ణ, పి.పేర్రాజు, బొల్లోజు రాజా, సూరవరపు వెంకటేశ్వరరావు, రమేష్, సత్య పాల్గొన్నారు.

ఓటు గల్లంతు

తుని రూరల్, జనవరి 23: అటికివానిపాలెం మాజీ సర్పంచ్ బెక్కం సూరిబాబు ఓటు గల్లంతైంది. ఇప్పటికే విడుదలైన ఓట్ల తుది జాబితా పార్టీ శ్రేణులకు చేరడంతో వాటిని సమీక్షించే పనిలో పడ్డారు. టీడీపీకి చెందిన పలువురు ఓట్లు డిలేట్ అయినట్లు ఆ పార్టీకి చెందిన ప్రతినిధులు తెలుపుతున్నారు. సమగ్ర పరిశీలన అనంతరం నియోజకవర్గ ఈఆర్వోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆల్ పార్టీల సభ్యులతో ఈఆర్వో సమావేశం

తునిరూరల్, జనవరి 23: ఓటర్ల తుది జాబితా విడుదల కావడంతో తుని నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి మూర్తి ఆల్‌పార్టీ సభ్యులతో సమావేశమయ్యారు. జాబితా ప్రతులను అందజేసి పార్టీల సభ్యులకు పలు సూచనలు చేశారు. హాజరైన వారిలో టీడీపీ నుంచి పోల్నాటి శేషగిరిరావు, వైసీపీ నుంచి పామర్తి మహేష్, కాంగ్రెస్ నుంచి గ్యాలం శ్రీనివాస్, బీజేపీ నుంచి ఆకెళ్ళ శాస్త్రి ఉన్నారు.

ప్రత్తిపాడులో అంగన్‌వాడీలు విజయోత్సవం

ప్రత్తిపాడు, జనవరి23: అంగన్‌వాడీల డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చేందుకు అంగీకరించడంతో మంగళవారం ప్రత్తిపాడులో అంగన్‌వాడీలు ఆందోళన విరమించి విజయోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీల డిమాండ్లు అధికశాతం ప్రభుత్వం అమలు చేసేందుకు అంగీకరించి చర్చలు సఫలం అవడంతో అంగన్‌వాడీలు ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలకు సన్నద్ధం చేయాలి

కరప, జనవరి 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలతో మండల స్థాయిలో గెలుపొందిన జట్లను నియోజకవర్గ పోటీలకు సన్నద్ధం చేయాలని ఆయా గ్రామాల కార్యదర్శులకు ఎంపీడీవో కె. అప్పారావు మంగళవారం తెలిపారు. ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించగా మండలస్థాయిలో పురుషులు, మహిళల విభాగంలో 10 టీంలు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యాయన్నారు. ఈ 10టీంలు జిల్లా క్రీడాఅధారిటీకి చెందిన క్రీడామైదానంలో 24వ తేదీ ఉదయం 7గంటలకు హాజరవుతాయని క్రీడాకారులకు తెలియజేసి కార్యదర్శులు తీసుకెళ్లాలన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కరప, జనవరి 23: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కరప ఎస్ఐ తుపాటి రామకృష్ణ తెలిపారు. మండలంలోని పెద్దాపురప్పాడు శివారు వైసావరం గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తి చుట్టుప్రక్కల గ్రామాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం సీసాలు కొనుగోలుచేసి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడు సత్యనారాయణ ఇంట్లో తనిఖీ చేయగా 84 క్వార్టర్ బాటిల్స్ లభ్యమయ్యాయి. ఆ బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అధికారులంతా అభివృద్ధిలో పాల్గొనాలి

కిర్లంపూడి, జనవరి 23: కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశంలో నిర్వహించారు. ఎంపీడీవో బడే రాజేశ్వరరావు నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ తోట రవి పాల్గొన్నారు. మండలస్థాయి అధికారులు పాల్గొని వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పనులు వివరించారు. కొంతమంది అధికారులు హాజరుకాకపోవడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ సందర్భంగా మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు రావడంలేదని ఈ సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో తోట గాంధీ, తహసీల్దార్ మాధవరావు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పరిశీలించిన ఆర్డీవో

సామర్లకోట, జనవరి 23: సామర్లకోట పట్టణ పరిధిలో పాత్రికేయులు, వివిధ వర్గాలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేసేందుకుగాను కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ మంగళవారం మధ్యాహ్నం సామర్లకోట-రాయభూపాలపట్నం పుంతరోడ్డులో అమ్మాణమ్మనాయుడు కాలనీ సమీపాన 5 ఎకరాల ఖాళీ పొలాలను సందర్శించారు. ఆర్డీవో వెంట సామర్లకోట తహశీల్దార్ ఎస్ఎల్ ఎన్. కుమారి, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్, వీఆర్వో నలజర్ల మురళీ కృష్ణ, రైతు కాటూరి జానకిరామ్ తదితర సర్వేయర్లు పాల్గొన్నారు.

లయన్స్‌సేవలు ఆదర్శనీయం

ప్రత్తిపాడు, జనవరి 23: ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ సేవలు ఆదర్శనీయమని తహసీల్దార్ వీవీవీ గోపాలకృష్ణ చెప్పారు. స్థానిక లయన్స్‌క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు ఆసుపత్రివద్ద గర్భిణులకు ఏర్పాటు చేసిన పోషకాహార కిట్లు తహసీల్దార్ పంపిణీ చేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సేవా సంస్థలు ముమ్మరంగా చేపట్టాలని తహసీల్దార్ కోరారు. క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కన్యాకుమారి, లయన్స్ రెడ్డినాయుడు, డేవిడ్‌రాజు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

యనమలను కలిసిన టీడీపీ శ్రేణులు

తుని రూరల్, జనవరి 23: ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ కీలకనేతలు మాజీమంత్రి పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును గతంలో దివంగత నేత తమ నాయకుడు వరుపుల రాజాను వేధింపులకు గురి చేసి ఆయన మరణం అనంతరం పార్టీని దెబ్బతీయాలని చూసిన వ్యక్తులు ఇప్పుడు టీడీపీలోకి చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారిని ఎట్టి పరిస్థితుల్లో పార్టీలోకి చేర్చుకోవద్దని కోరారు. దీంతో యనమల స్పందిస్తూ నియోజకవర్గ పార్టీ నాయకులు అభీష్టం మేరకే చేరికలు ఉంటాయని హామీ ఇస్తూ పార్టీ శ్రేణులు ఎటువంటి అపోహలకు గురి కావద్దన్నారు. యనమలను కలిసిన వారిలో టీడీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, కొమ్ముల కన్నబాబు, ప్రభాకరరావు, మంతెన శ్రీనులతోపాటుగా, నాయకులు ఉన్నారు.

ప్రజల కోసం పనిచేసేవారికి అండగా నిలవండి

● పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు, జనవరి 23: నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న వారిని గుర్తించి వారికి అండగా నిలవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఏనాడు ప్రజలకు కనబడని పొన్నూరు నాయకులంతా నేడు ఎన్నికలు వస్తుండటంతో మరలా గ్రామాలకు వస్తున్నారని తెలిపారు. అటువంటి వారిని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు ప్రభుత్వంలో మహిళలకే ప్రాధాన్యం

శంఖవరం, జనవరి 23: వచ్చే ఎన్నికలలో చంద్రబాబు ప్రభుత్వం రావడం ఖాయమని చంద్రబాబు ప్రభుత్వంలో మహిళలకే అధిక ప్రాధాన్యమని టీడీపీ ఇంచార్జ్ వరుపుల సత్యప్రభ అన్నారు. మంగళవారం సీతంపేటలో మీకోసం మీఇంటికి మీసత్యప్రభ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ 6మేనిఫెస్టోలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్ది రామారావు, పిర్ల అప్పారావు, ఉగ్గిరాల నాగేశ్వరావు, బచ్చల గంగ, వెన్నా ఈశ్వరుడు, కీర్తి సుభాష్, ఉల్లి వీరభద్రరావు, ఈగల దేవుళ్ళు, తదితరులు పాల్గొన్నారు.

గెలిపే లక్ష్యంగా పనిచేయాలి

● తుని టీడీపీ ఇన్‌చార్జ్ యనమల దివ్య


తునిలో పార్టీకండువా కప్పి ఆహ్వానిస్తున్న శివరామకృష్ణన్

తుని రూరల్, జనవరి 23: పార్టీ గెలిపే లక్ష్యంగా పని చేయాలని తుని టీడీపీ ఇన్‌చార్జ్ యనమల దివ్య తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పెయ్యల సూరిబాబు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరేందుకు ఆసక్తి కనపరచడంతో వారికి దివ్య, కృష్ణుడు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని, టీడీపీలోనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు.

తునిలో పలువురు టీడీపీలో చేరిక

తుని మండలం వల్లూరు గ్రామం వైసీపీ నాయకుడు, మాజీ కో ఆపరేటివ్ డైరెక్టర్ కొత్తూరు నాగభూషణం టీడీపీలోకి చేరారు. ఆయన తునిలో జిల్లాతెలుగుయువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నాగభూషణంతో పాటుగా 20 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పోల్నాటి శేషగిరిరావు, మోతుకూరు వెంకటేష్, చిటికెల శ్రీనివాస్, గాది వరహాల బాబు, తదితరులు ఉన్నారు.

ఘనంగా రావులమ్మ సంబరం

జగ్గంపేట, జనవరి 23: జగ్గంపేట గ్రామదేవత రావులమ్మ తల్లి మొదటి సంబరాన్ని సంఘ సభ్యులు, గ్రామస్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి అనంతరం జగ్గంపేట పట్టణంలో గ్రామదేవత రావులమ్మతల్లికి సంబరాలు జరపడం ఆనవాయితీగా వస్తోంది.

మతాతీతమైన విజ్ఞానం ప్రబోధించిన మహనీయుడు కవిశేఖర్


కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైస్ ఛాన్సలర్ ప్రసాదరాజు

సర్పవరం జంక్షన్, జనవరి 23: మతాతీతమైన విద్య, విజ్ఞానం ప్రబోధించిన మహనీయుడు కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా అని జేఎన్‌టీయూకే వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. మంగళవారం అహ్మద్ ఆలీషా ఆధ్వర్యంలో బోట్‌క్లబ్ వద్ద కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 79వ వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళాభ్యుదయం కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప మానవతా వాది అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, బహు గ్రంథ కర్త, స్వాతంత్ర సమరయోధుడుగా, ఎంపీగా పలు రంగాల్లో తనదైన శైలిలో విశేష సేవలు అందించిన గొప్ప మహనీయుడు కవిశేఖర్ ఉమర్ ఆలీషా అని కొనియాడారు. ఈ సందర్భంగా పక్షుల ఆహారం కోసం ధాన్యపు కుచ్చును మండా ఎల్లమాంబ, కాకినాడ లక్ష్మి, ఆలీషాలు అందించారు. అనంతరం విశిష్ట అతిథులుగా విచ్చేసిన ఏపీ సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, భవర్ లాల్‌జైన్, హుస్సేన్ షాలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ శాఖ పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, అచ్చంపేట సర్పంచ్ సలాది రమేష్, సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

విధులకు హాజరైన అంగన్‌వాడీలు

తాళ్లరేవు, జనవరి 23: ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లకు ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వారు సమ్మె విరమించారు. మంగళవారం అంగన్‌వాడీవర్కర్లు, హెల్పర్లు సమ్మె విరమణ పత్రాలను తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి మాధవికి అందించి అంగన్వాడీ సెంటర్లను తెరచి సచివాలయ సిబ్బంది నుంచి సెంటర్ బాధ్యతను స్వీకరించారు. గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో వర్కర్లు బాధ్యలతను చేపట్టారు.

ఆయిల్ ఫాం రైతులకు అవగాహన సదస్సు

గండేపల్లి, జనవరి 23: మండలంలో మురారి గ్రామంలో మంగళవారం గ్రామానికి చెందిన రైతు ఆళ్ళ సత్యనారాయణ పామాయిల్ తోటలో పతాంజలి ఫ్రూట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌ఫాం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పతాంజలి ఫ్రూట్స్ డీజీఎం ఏఎస్ ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌ఫాం సాగు విస్తరణ, సాగుచేసే పద్ధతిపై అవగాహన కల్పించారు. దిగుబడులు, గెలలు కోత, పంట నాణ్యతలపై రైతులకు వివరించారు. ఫెర్టిగేషన్ ద్వారా ఎరువుల వాడకంపై రైతులకు తెలిపారు. కార్యక్రమంలో జి.దుర్గాప్రసాద్, ఉపసర్పంచ్ జాస్తి వసంత్, ఎస్.వీ రాజు, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

పెద్దాపురం, జనవరి 23: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగ తాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి యూనిట్ కంప్యూటర్ ఎంబ్రాయిడరీ శిక్షణా కేంద్రాన్ని వారు మంగళవారం ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. మెప్మా పీడీ బి.ప్రియంవద మాట్లాడుతూ మహిళలు శిక్షణ పొందడంద్వారా ఆర్థిక సుస్థిరతను సాధించవచ్చని పేర్కొన్నారు. జిల్లా జీవనోపాదుల సంస్థాగత అధికారి కె.మోహన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, కౌన్సిలర్లు అరెళ్ల వీర్రాఘవరావు, విడదాసరి రాజా, మెప్మా సీఎంఎం జి.భ్రమరాంబ, సీవోలు ఉమాపార్వతి, శ్రీదేవి, సత్యవాణి పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

జగ్గంపేట, జనవరి 23 : సుభాష్ చంద్రబోస్ 126వ జన్మదినం సందర్భంగా జగ్గంపేట గ్రామం సుభాష్‌లో వీధి ఆర్యవైశ్య అధ్యక్షుడు కొత్త కొండబాబు, డాక్టర్ బీవీ ప్రసాద్ చేతులమీదుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దారా రాజు, దారా శ్రీనివాస్, ఎం.సురేష్, రాంపండు, కొత్త నాగపండు, వై.రాముడు, బి.చంద్రరావు, వీర్రాజు, నాగేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

ధన సత్తమ్మగుడి వద్ద అన్న సమారాధన

జగ్గంపేట, జనవరి 23: స్థానిక శెట్టిబలిజపేట శివారులో ఉన్న శ్రీ ధనసత్తమ్మ అమ్మవారి గుడివద్ద గిడుతూరి సత్యనారాయణ ఆర్థిక సహాయంతో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వైభోగుల కొండబాబు యాదవ్ మాట్లాడుతూ ధన సత్తమ్మ అమ్మవారి మహిమ వలన ఇక్కడికి వచ్చి మొక్కుకునే వారి కోరిన కోర్కెలు సిద్ధిస్తుందని భక్తుల అపార నమ్మకతో ఆలయం వద్ద ప్రతి మంగళవారం దాతల సహకారంతో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

భువనేశ్వరికి ఘన స్వాగతం పలకాలి

గండేపల్లి, జనవరి 23: బుధవారం జగ్గంపేట మండలం గొల్లలగుంట నారా భువనేశ్వరి విచ్చేస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలకాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు అన్నారు. చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో గొల్లలగుంటకు చెందిన వ్యక్తి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్నారని మోహన్‌రావు తెలిపారు.